క్లుప్తంగా

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని షిర్డీ సాయిబాబా మందిరం 15వ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సాయిబాబాకు అభిషేకాలు, హారతులు, నవగ్రహాది మండపారాధన చేశారు. అనంతరం శ్రీలక్ష్మి గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నూతన వంశ పారంపర్య ధర్మకర్తగా తుటారం చక్రవర్తి ప్రమాణ స్వీకారం చేశారు. చక్రవర్తి దంపతులను ఏపీ ఐబీసీ డైరెక్టర్ మండలి రాజేష్, అవనిగడ్డ ఎమ్మెల్యే తనయుడు మండలి రాజా సన్మానించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, అవనిగడ్డ సీఐ యువకుమార్, ఆలయ నిర్మాణకర్త తుటారాం రామారావు(రాము), మండలి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానం


శివవెంకటరత్నం(ఫైల్)

నాగాయలంక: గ్రామంలోని పదో వార్డుకు చెందిన సబ్బినేని శివ వెంకటరత్నం(75) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆమె నేత్రాలను స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ సహకారంతో విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. ఆమె కుమారుడు శివరామప్రసాద్, కుమార్తె సుఖవాసి శివపార్వతి ఇతర కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందు కొచ్చారు. సేవా సంస్థ నిర్వాహకుడు తలశిల రఘుశేఖర్, కె.వెంకట నారాయణ సహకారంతో కంటి ఆసుపత్రి ఐ టెక్నీషియన్ సాయి బృందం వచ్చి మృతురాలి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు.

రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన

బంటుమిల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మండల ఏఓ జి. శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) మత్స్యశాఖ సైంటిస్ట్ జె. యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ కేవీకే ద్వారా రైతులకు అందుతున్న విత్తనాల రకాలు, ప్రభుత్వ పథకాలను వివరించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వర్సిటీ విశ్రాంత పరిశోధన సహాయ సంచాలకులు డాక్టరు రోశయ్య, సీనియర్ సైంటిస్ట్ డాక్టరు వి.లలిత, పెదవేగి ఆయిల్ ఫామ్ పరిశోధన కేంద్ర సైంటిస్ట్ డాక్టరు సుబ్బన్న, కృత్తివెన్ను ఏఓ జెస్సీ, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు

అవనిగడ్డ: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక జమామియా మసీద్ వద్ద ఇమామ్ ఎండీ షహజాద్ ఈద్ అల్ అదా నమాజ్ చేశారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లింలు ప్రార్థనలో పాల్గొన్నారు. మశీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, వైస్ ప్రెసిడెంట్ గౌస్‌ఖాన్, కార్యదర్శి షేక్‌బాబావలి తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కోడూరు: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ విశిష్టతను ఇమామంలు వివరించారు.

బంటుమిల్లి: స్థానిక జామియా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గా మైదానంలో మజీద్ గురువు మౌలానా అబ్దుల్ వాహెద్ బక్రీద్ ప్రాముఖ్యతను వివరించారు. మజీద్ కమిటీ సభ్యులు ఎండీ కమాల్, బాబ్జి, నజీర్, అక్టర్, అలీం, హాదిన్ పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు మండలంలో బక్రీద్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. గూడూరు జామియా మసీదులో జరిగిన ప్రార్థనలు, నమాజులలో హాఫీజ్ మహమ్మద్ సయ్యద్ కుద్వా ప్రసంగం ఇచ్చారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు.


పెడనలో ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు

పెడన: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలో వివిధ మజీద్‌ల నుంచి ర్యాలీగా గుడివాడ రోడ్డులోని ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

నాగాయలంకలో ప్రార్థనలు

నాగాయలంక: బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని స్థానిక కృష్ణానది తీరంలోని జుమా మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు అందిపుచ్చుకున్నారు. మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ జాని, కమిటీ పెద్దలు షేక్ అమీర్ జాని, రహంతుల్లా, పఠాన్ సుభానీ పాల్గొన్నారు.

చల్లపల్లిలో ఘనంగా వేడుకలు

చల్లపల్లి: బక్రీద్ పండుగను ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక పెద్ద మసీదు నుంచి ముస్లింలు ర్యాలీగా ఈద్గా ప్రాంగణానికి చేరుకున్నారు. పెద్దమసీదు మత గురువు ఇమామ్ ఆధ్వర్యంలో ఈద్ ఉల్ అజా పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


అవనిగడ్డలో బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


నాగాయలంకలో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు


చల్లపల్లిలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

ప్రతిభా అవార్డులకు ఎంపిక

పెడన: విశ్వభారతీ హైస్కూల్‌లో చదువుకున్న పదో తరగతి విద్యార్థినులు కేదారి శ్రీలక్ష్మీ సుమ(589), ఉమ్మిటి నాగలలిత(588)లు ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారని ఆ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎ.గౌరీప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పేరుతో రూ.20వేలు నగదు, జ్ఞాపిక, ప్రశంస పత్రంను ఈ నెల 9న జిల్లా మచిలీపట్నంలో అందజేస్తుందని పేర్కొన్నారు.

బంటుమిల్లి: స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు డాగూరి రామ్‌చరణ్(593), భీమనాతి శ్రీవల్లి, షేక్ షఫియారోషన్, బుద్దన వెంకటలక్ష్మి తేజస్విని(592), బండేలా టానియాసిప్రా ఆనంద్, నుగలాపు కల్యాణి(585)లు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టరు సాబూజాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం ఝూన్సీసాబూ, ఉపాధ్యాయులు అభినందించారు.

కోడూరు లక్ష్య స్కూల్ విద్యార్థులు

కోడూరు: షైనింగ్ స్టార్ అవార్డులకు కోడూరు లక్ష్య స్కూల్ విద్యార్థులు గుడివాక జూనియస్(588), జరుగు దానియేలు(587), షేక్ మొహసిన్(587), బెల్లంకొండ విఘ్నేష్(584)లు ఎంపికైనట్లు విద్యాసంస్థల అధినేత విస్సంశెట్టి శివనాగరాజు తెలిపారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

స్వచ్ఛ సుందర చల్లపల్లి పరిశీలన



చల్లపల్లి: ముక్యాల గ్రామ పంచాయతీ నుంచి వచ్చిన 35 సభ్యులు స్వచ్ఛ సుందర చల్లపల్ల కార్యక్రమాలను శనివారం పరిశీలించారు. తెల్లవారు జామునే స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలతో కలిసి 216 జాతీయ రహదారిపై కాసానగరం వద్ద స్వచ్ఛ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పద్మావతి ఆసుపత్రిలో డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమాలను ప్రొజెక్టర్‌పై వారికి వివరించారు.

పెళ్లింట హిజ్రాలు హల్‌చల్

శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళంలో ఓ పెళ్లింట హిజ్రాలు హల్‌చల్ చేశారు. శ్రీకాకుళం నాయీ బ్రాహ్మణ సామాజిక భవనంలో ఓ పెళ్లి జరిగింది. అయితే విజయవాడ నుంచి వచ్చిన ఇద్దరు హిజ్రాలు రూ. 11వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్య తరగతి కుటుంబమని అంత ఇవ్వలేమని రూ. 2వేలు తీసుకుని వెళ్లమని పెళ్లి కుటుంబసభ్యులు, బంధువులు బ్రతిమలాడినా వినలేదు. ఇంతలో బంధువుల్లో ఒకరు ఫోన్‌లో ఫొటోలు తీస్తుండగా ఆయనపై తీవ్రస్థాయిలో దుర్భాషలాడి, అసభ్యంగా ప్రవర్తించారు. చివరికి హిజ్రాలు రూ.5వేలు తీసుకున్నారు. వీరి ఆగడాలకు విసిగి వేశారిన బంధువులు కొంతమంది ఘంటసాల ఎస్‌ఐకు ఫోన్ చేయడంతో అక్కడ నుంచి వారు ఉడాయించారు.

ఎండు చేపలపై ఫిషరీస్ విద్యార్థులకు అవగాహన

నాగాయలంక: భావదేవరపల్లిలోని మండలి కృష్ణారావు ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులకు శనివారం స్థానిక ఎండు చేపల సంతలో వివిధ రకాల డ్రైఫిష్ తయారీ విధానాలపై అవగాహన కల్పించారు. కళాశాల ఆధ్వర్యంలో ప్రతి ఏటా క్షేత్రస్థాయి ప్రాక్టికల్‌లో భాగంగా 17వ బ్యాచ్ ఫైనల్ సెమిస్టర్ విద్యార్థులకు స్థానిక కృష్ణాతీరంలోని పర్యాటకశాఖ ఫుడ్‌కోర్టు భవనంలో ఔత్సాహిక కేజ్ కల్చరిస్ట్, ఆక్వారైతు తలశిల రఘుశేఖర్ ఎండు చేపలను తయారు చేయడంలో హైజీనిక్ విధానాలను వివరించారు. అంతకు ముందు కళాశాల బీఎఫ్‌ఎస్‌సీ మురళీకృష్ణ, శేఖర్‌తో కలిసి సంతలో విక్రయిస్తున్న ఎండుచేపలను పరిశీలించారు. డ్రైఫిష్ తయారీకి అధికంగా వినియోగించే పండుగప్ప, మ్యామ్, గురక, మాత లాంటి చేపలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు.


ఎండు చేపలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శేఖర్

మంగినపూడిబీచ్‌ను క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దుతాం

మంత్రి కొల్లు రవీంద్ర

చిలకలపూడి(మచిలీపట్నం): మంగినపూడి బీచ్‌ను పర్యాటకంతోపాటు వివిధ క్రీడల నిర్వహణ ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శాప్ చైర్మన్ రవినాయుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. ఫిషింగ్ హార్బర్ వద్ద జలక్రీడల అకాడమీ ఏర్పాటు చేసి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ బీచ్ కబడ్డీ, వాలీబాల్, జలక్రీడల్లో మంచి ఆటగాళ్లను తయారు చేస్తామన్నారు. అనంతరం కబడ్డీలో అర్జున అవార్డు గ్రహీతలు నీతా దాద్వే, మమత పూజారి, జెస్సీ సింగ్, జల క్రీడల అర్జున అవార్డు గ్రహీత ప్రాజియాదవ్, కాయాకింగ్ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు బీ బలరామ్ నాయుడు తదితరులను మంత్రి, శాప్ చైర్మన్, కలెక్టర్ అభినందిస్తూ శాలువాలతో వారిని సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, డీఎస్‌డీవో జాన్సీలక్ష్మి, ఆంధ్ర కబడ్డీ సంఘం కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, కాయాకింగ్ కృష్ణా జిల్లా సంఘం అధ్యక్షుడు డీ సురేంద్రబాబు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన అర్జున అవార్డు గ్రహీతలు, క్రీడా సంఘాల ప్రతినిధులు

వైఎస్సార్ సీపీ మండలాల కమిటీలు నియామకం

పెడన: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పెడన మండల కమిటీని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ పెడన ఉపాధ్యక్షులుగా గుడిసేవ శ్రీనివాసరావు, ఊసల శ్రీనివాసరావులను నియమించారు. జనరల్ సెక్రటరీలుగా అంకెం నరసింహారావు, పరసా సుబ్బారావు, బొడ్డు హరిబాబు, లోయ ఆంజనేయులు, సెక్రటరీలుగా పెద్ది ప్రసాద్, చెన్నూరు లక్ష్మయ్య, దేవబోయిన శివరామ్, కటికల జోజిబాబు, చుక్కా కృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గంధం శ్రీనివాసరావు, యర్రంశెట్టి నాగరాజు, రాజులపాటి మస్తాన్‌రావు, పూరిళ్ల కోటేశ్వరరావు, గాజుల శ్రీనివాసరావు, పల్లపోతు చినకోటేశ్వరరావు, పుట్టి ఆంజనేయులు, శింగంశెట్టి రాంబాబు, కాగిత వెంకన్న, ఉయ్యూరు బాలాజీ, అర్జా వెంకటేశ్వరరావు, వూచా సత్యనారాయణ, గజ్జల రాజీవ్, కట్టా ప్రసాద్, బడుగు భగవాన్, పరసా శ్రీనివాసరావు, ఆరేపు రామరాజు, కారే నారాయణ, సొంఠి స్వామి, పోసిన మోహనరావు, పళ్లెం వేణు, జొన్నం శ్రీనివాసరావు, లింగం హరిశివ, మేకా రవి, దావు శ్రీనివాసరావు, జోగి శ్రీను, బొల్లా శ్రీను, రాజులపాటి కనక, గంధం విజయలక్ష్మి, కాటం నాగమణి, బీడెళ్లి పద్మ, గజ్జల లక్ష్మి, కట్టా అనితాదేవి, కుమ్మా ధనలక్ష్మి, యర్రంశెట్టి జయశ్రీ, దావు నాగగంగా, దాసరి అనురాధ, పరసా వెంకటేశ్వరమ్మలను నియమించారు.

కృత్తివెన్ను మండల కమిటీ

కృత్తివెన్ను: వైఎస్సార్ సీపీ కృత్తివెన్ను మండలం కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యక్షులుగా పెనుబోతు రాంబాబు, కటకం చార్లెస్, జనరల్ సెక్రటరీలుగా తమ్ము ఏడుకొండలు, తిరుమాని సత్యనారాయణ, తోట గోపి, పెద్దసింగు వెంకటేశ్వరరావు(చిన్న), కార్యదర్శులుగా ఆలపాటి వాసు, చెన్ను దుర్గారావు, జల్లా నాగార్జున, పమిడికొండల శ్రీఆంజనేయులు, పిన్నింటి దేవివరప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అలెగ్జాండర్, నల్ల నాగబాబు, ఎలవర్తి కోటేశ్వరరావు, కొల్లాటి ఏసుబాబు, పులగం సుబ్రహ్మణ్యం, బొర్ర వెంకటస్వామి, బస్వాని అంజిబాబు, రేవు ఏసుబాబు, అర్జెంపూడి సోమేశ్వరరావు, ఎనగల నాగబాబు, పట్టపు ప్రసాద్, చింత వెంకటేశ్వరరావు(చినబాబు), పెద్ది శ్రీను, కొల్లాటి భరణి, కొప్పాడి నాగార్జున, నల్లగంగుల రత్నరాజు, పుప్పాల శ్రీనివాసరావు(వాసు), పొన్నమండ సత్యనారాయణ(చిన్న), ఎడవల్లి వీరబాబు, నడికుదిటి ఏడుకొండలు, అడబాల సత్యవతి, కాశీ సోనియా, ముచ్చల సౌభాగ్యం, మేక మావుళ్లమ్మ, షేక్ షహనాజ్ బేగంలను నియమించారు.

గూడూరు మండల కమిటీ

గూడూరు: వైఎస్సార్ సీపీ గూడూరు మండల కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షులుగా రాయల శ్రీహరి, బత్తిన నరసింహస్వామి, జనరల్ సెక్రటరీలుగా ఊకంటి వెంకటరెడ్డి కుమార్, ఎండీ యూసఫ్‌ఖాన్, ఎజ్జు వెంకయ్య, కర్రా మణికంఠ, కార్యదర్శులుగా సురవరపు గోపాలకృష్ణ, బొల్లా నాగలక్ష్మణరావు, కొడాలి అశోక్, రాచకుల నాగూర్, మెట్ల రమేష్, కార్యవర్గ సభ్యులుగా పిచ్చుక మూర్తిరాజు, కైలా నానిబాబు, దేశి వీరాంజనేయులు, యర్రంశెట్టి గంగయ్య, గోవాడ గురువారెడ్డి, కాగిత శ్రీనివాసరావు, ఎండీ అలీ, మునేపల్లి ఆంజనేయులు, మత్తి ధనమూర్తి, మద్దాల సతీష్, పరసా ఫణికుమార్, ఆకుల శ్రీనివాసరావు, జిన్నాబత్తిన వెంకటేశ్వరరావు, సల్మాన్, కమ్మిలి సుభాష్ చంద్రబోస్, కోళ్లపల్లి సత్యనారాయణ, కొల్లూరి పెదకోటేశ్వరరావు, అద్దంకి హరీష్ రెడ్డి, ఉప్పాల యుగంధర్, బూసం సాయిబాబు, పోసిన రేణుకారావు, మేడా పావని, యర్రంశెట్టి శ్రావణి, కొట్టే శిరీష, బత్తిన వీరకుమారి, పెన్నేరు శివపార్వతీలను నియమించారు.

నేడు జానపద, పౌరాణిక నాటక ప్రదర్శనలు

చల్లపల్లి: స్థానిక ఎన్టీఆర్ పార్కులో ఆదివారం జానపద, పౌరాణిక నాటకాలను ప్రదర్శించనున్నట్లు ప్రముఖ సినీ, రంగస్థల కళాకారుడు, నంది అవార్డు గ్రహీత బోలెం రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో కూచిపూడి, భరతనాట్యం, దుర్యోధనుడి మయసభ, రామభక్త హనుమాన్ నాటకం, గరుత్మంతుడు, హరిశ్చంద్ర వారణాసి సీను వంటి ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా పృథ్వీరాజ్ చౌహాన్ జయంతి

అవనిగడ్డ: అతి చిన్నవయస్సులోనే ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించిన పృథ్వీరాజ్ చౌహాన్ 859వ జయంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అగ్నికుల క్షత్రియ సామాజిక భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ జాతీయ గౌరవ సలహాదారుడు లంకే యుగంధర్ పూలమాలవేసి నివాళులర్పించారు. అగ్నికుల క్షత్రియ నేతలు కోలా వెంకటేశ్వరరావు, సైకం శ్రీనివాసరావు, కోలా బాలాజీ, మేడా నెలబాలుడు పాల్గొన్నారు.

అధికారుల సలహాలతో అధిక దిగుబడులు

అవనిగడ్డ: వ్యవసాయ సాగులో అధికారుల సూచనలు, సలహాలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వీ మంజువాణి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు, ఖర్చులు తగ్గించుకుని మంచి లాభాలు పొందేందుకు వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దివి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాఘవేంద్రరావు

అవనిగడ్డ: దివి వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా న్యాయవాది పర్చూరి రాఘవేంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా కొండవీటి మురళిని ఎన్నుకున్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్‌గా కొల్లాయిగుంట రాఘవులు, కోశాధికారిగా వడ్లమూడి నాగవెంకట శశికుమార్, గౌరవ అధ్యక్షుడిగా ఆర్ రాఘవేంద్రరావు, 9 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



విద్యాగడ్డ అవనిగడ్డ

విద్యా రంగంలో తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు

అవనిగడ్డ: నియోజకవర్గ కేంద్రమైన అవనిగడ్డ విద్యాగడ్డగా వెలుగొందుతోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్లు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే ఎంతో గుర్తింపు పొందాయి. భావి భారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుల తయారీ కేంద్రంగా అవనిగడ్డ ఖ్యాతి గడించింది. అవనిగడ్డ, చల్లపల్లి, కోడూరు, మోపిదేవి, నాగాయలంకలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఒకరికొకరు పోటీపడి నిర్వహిస్తుండటంతో దివిసీమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పలు ర్యాంకులు సాధిస్తున్నారు. ఇక్కడున్న వ్యాయామ ఉపాధ్యాయులు ఎక్కడా ఉండరు. అందుకే క్రీడల్లోనూ ఈ ప్రాంత విద్యార్థులు కొందరు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఈ ప్రాంత విద్యార్థులు పలు సాంస్కృతి కార్యక్రమాల్లోనూ తమ ప్రతిభను చాటుకుంటున్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు


108 కలశాలకు పూజలు చేస్తున్న ఉభయదాతలు

- కనులపండువగా వెంకన్నకు శత కలశ క్షీరాభిషేకం
- నేడు స్వామివారి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

కోడూరు: భక్తుల హరినామస్మరణ మధ్య వెంకన్నకు అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివార్లకు విశేష పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవతో కార్యక్రమాలను ప్రారంభించి, తిరువారాధన, హోమాలను నిర్వహించారు. 108 కలశాలతో ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామివారిని కోడూరులోని ఇమ్మడి వెంకటకృష్ణప్రసాద్(చిన్నా) ఇంటికి ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి వంతెన సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఎదుర్కోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కల్యాణం ఏర్పాట్లు పూర్తి

ఆదివారం ఉదయం కొతుకోత్సవం, రాత్రి స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ తెలిపారు. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణతో పాటు స్వామివారి భారీ విద్యుత్ చిత్రపటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.